# ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారి దర్శనం

**పులివెందుల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

పులివెందులలోని శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వేంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ముత్యపు పందిరివాహనంపై కూర్చోబెట్టి గ్రామోత్సవం నిర్వహించారు.




# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 08 ఫిబ్రవరి 2025


# మరోసారి మానవత్వం చాటుకున్న అధికారులు

**రాయచోటి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**



రాయచోటిలోని బస్టాండ్ నందు గల ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు మరిచిపోయిన బ్యాగును కడప నుంచి పుంగనూరు వెళుతున్న ఆర్టీసీ బస్సులో బ్యాగు మారిపోవడం వలన ప్రయాణికులు బస్టాండ్ లోని కంట్రోల్ పాయింట్ నందు గల ప్రైవేట్ అనౌన్సర్ రోషిని వద్ద అప్పగించడంతో ఆ బ్యాగును అందులో ఉన్న బట్టలు లక్షలాది రూపాయలు విలువ లో చేసే నగలను సంబంధిత అధికారులు ఎం ఎం నాయక్ టీ3 అనౌన్సర్ రోషిని లు బ్యాగు గల వారికి తెలియజేసి వారిని పిలిపించి వారి చేతికి బ్యాగు తో నగలను అప్పగించడం జరిగింది. దీంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు పోగొట్టుకున్న, మారిపోయిన బ్యాగులను వారి నగలను భద్రంగా తిరిగి వారికి అప్పజెప్పడంతో వారు ఆర్టీసీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు

# వేసవిలో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

**కడప, ఫిబ్రవరి7 ప్రభాతవార్త**

వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి.. తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో వేసవిలో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాల సన్నద్ధతపై సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. మార్చి 20వ తేదీ లోపు పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. అందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలను అందజేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ. ఈ వేసవిలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, ప్రాంతాల్లో తాగునీటి అవసరాలతో పాటు రూరల్ ప్రాంతాల్లో తాగునీటి



ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి పులివెందుల మున్సిపాలిటీకి తాగునీరందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న, ఈఈ విజయ్ భాస్కర్, పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, ఈ ఈ చిదానంద రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో రసవత్తరంగా

# ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు..!

**- అధ్యక్ష పదవికి త్రిముఖ పోటీ**

**- 7 వార్డులకు గాను 6 వార్డులు ఏకగ్రీవం**

**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**

ఉమ్మడి కడప జిల్లాలోనే ఆర్థికంగా బలమైన సంఘంగా పేరొందిన రాజంపేట ఆర్యవైశ్య సంఘానికి ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి అధ్యక్ష పదవికి ప్రస్తుతం గ్రంధే సత్యనారాయణ గుప్త, తుమ్మలపెంట (పాల) ప్రకాష్, అన్నం సుబ్బరాయుడులు ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సంఘంలో ఉన్న 7 వార్డులకు ఒకో వార్డుకు 3గురు చొప్పున మొత్తం 21 మందిని ఎన్నికుంటారు. కాగా సంఘంలో 1, 2, 3, 4, 6, 7 వార్డులు ఏకగ్రీవం కాగా 5వ వార్డుకు 4గురు పోటీ పడడంతో ఈ ఒక్క వార్డుకు అధ్యక్ష ఎన్నికతో పాటు ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య కుటుంబాల్లో ఒక కుటుంబానికి ఒక ఓటు మాత్రమే ఉంటుంది. ప్రస్తుతం సంఘంలో 493 ఓట్లున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న ఈ సంఘం పోలింగ్ తదుపరి సాయంత్రం 6 గంటలకు కౌంటింగ్ చేపట్టి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారుల నియామకం కూడా చేసి ఉన్నారు. ఇకపోతే పోటీలో ఉన్న పాల ప్రకాష్ ఒకమారు, గ్రంధే సత్యనారాయణ గుప్త రెండుమార్లు గతంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పనిచేసిన వారే. అన్నం సుబ్బరాయుడు గతంలో అధ్యక్ష పదవికి పోటీ చేసి ఉన్నారు. తిరిగి ఈ మారు తన అదృష్టాన్ని పరిక్షించుకుంటాన్నారు. మూడేళ్ల కాలపరిమితి కలిగిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను ఆర్యవైశ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూస్తున్నారు. అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న పాల ప్రకాష్, సత్యనారాయణగుప్తలు గతంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా తాము చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ, తిరిగి ఎన్నుకుంటే సంఘాన్ని ఉన్నతంగా తీసుకెళతామని, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ సర్వతోము ఖాభివృద్ధికి పాటుపడతామని చెపుతూ ఓటర్లను మద్దతుదారులతో కలిసి కలుసుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్నం సుబ్బరాయుడు మాత్రం ఏకవ్యక్తిగా ప్రచారంలో ఉన్నారు. బంధుత్వాలు, స్నేహితులు, సన్నిహితులతో పాటు మరికొందరు పోటీ పడుతున్న అభ్యర్థులకు తమ మద్దతును బహిరంగంగా ఇచ్చి ప్రచారంలో పాల్గొంటున్నారు. మరికొందరు తటస్థ వైఖరిని అవలంబిస్తున్నారు. కాగా సంఘంలో ఓటరుగా ఉండి ఇతర ప్రాంతాల్లో నివాసముండే వారిని కూడా ఓటింగ్ సమయానికి రప్పించేందుకు పోటీ పడుతున్న అభ్యర్థులు వారి వారు మార్గాల్లో ప్రయత్నం చేసుకుంటున్నారు. జనవరి 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యిన ఈ సంఘం ఎన్నిక ఆదివారం జరగనుండడంతో ప్రచారం ఊపందుకుంది. పట్టణంలో అమ్మవారిశాల వీధి, బండ్రాళ్ల వీధి, జవుళిబజార్, నాగులమానువీధి, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఆర్యవైశ్యులు అధికంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం పట్టణంలోని అన్ని వీధుల్లో ఆర్యవైశ్యులు ఉండడంతో పట్టణమంతా మున్సిపల్ ఎన్నికల రీతిన ప్రచారం ఊపందుకొని ఉంది. ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘానికి ఒక 5వవార్డులో మాత్రమే వార్డు మెంబర్‌తో పాటు అధ్యక్ష పదవికి ఓటరు ఓటు హక్కు వినియోగించుకుంటారు. మిగిలిన అన్ని వార్డులు ఏకగ్రీవం కావడంతో అధ్యక్ష పదవికి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

# విచారణకు హాజరైన అప్రూవర్ షేక్ దస్తగిరి

## కేసు పై దృష్టి పెట్టిన కూటమి పెద్దలు... తొందరలో ఎండ్ కార్డు పడుతుంది



**పులివెందుల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

మాజీమంత్రి వై.ఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ గా వున్న షేక్ దస్తగిరి కడప సెంట్రల్ జైలులో శుక్రవారం విచారణకు హాజరయ్యారు. కడప సెంట్రల్ జైలులో షేక్ దస్తగిరిని ఏడాది క్రిందట పెట్టిన ప్రలోభాలు, ఇబ్బందులు, బెదిరింపులు ఘటన పై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో విచారణ కడపలో ప్రారంభం అయింది. షేక్ దస్తగిరి ఓ అట్రాసిటీ కేసులో 2023 అక్టోబరు నుండి 2024 ఫిబ్రవరి వరకు కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వున్న సందర్భంలో వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ 5 గా వున్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి చైతన్య రెడ్డి(ఏ1) అప్పటి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ (ఏ 2), జమ్మలమడుగు డి.ఎస్పీ నాగరాజు(ఏ 3), ఎర్రగుంట్ల సి.ఐ ఈశ్వరయ్య(ఏ 4)లు తనను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో వై.సి.పి ప్రభుత్వం అధికారంలో వుండడంతో అప్పటి అధికారులు పట్టించు కోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కేసు విచారణ వేగవంతం చేశారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు ఈనెల 3వతేదీ ఆ నలుగురి పై పులివెందుల పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. దస్తగిరి తన ఫిర్యాదులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వున్న తనను 2023 నవంబరు 28న జైల్ లోని ఎస్ ఎస్.ఆర్ బ్యారక్ లోకి డాక్టర్ చైతన్యరెడ్డి వచ్చి తాను వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారినందున వివేకాహత్య కేసులో వై.ఎస్ అవినాష్ రెడ్డి, వై.ఎస్ భాస్కర్ రెడ్డి, డి శివశంకర్ రెడ్డిలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని బెదిరించారని, అప్పటి సిబిఐ అధికారి రామ్ సింగ్ కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని ప్రలోభ పెట్టారని, తమకు అనుకూలంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని అప్పట్లో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వేళ మేము చెప్పినట్లు వినకపోతే జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత నిన్ను చంపుతామని బెదిరించారని దస్తగిరి పోలీసులకు ఫిర్యాదులో తెలిపారు. చైతన్యరెడ్డి తనను బెదిరించే సమయంలో అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ వారించలేదని ఫిర్యాదు చేశారు. జైలు సూపరిం టెండెంట్ వారం రోజుల పాటు చీకటి గదిలో బంధించారని ఫిర్యాదు చేశారు. అలాగే తనను అప్పటి జమ్మలమడుగు డి.ఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల సి.ఐ ఈశ్వరయ్యలు బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఈ సంఘటనకు సంబంధించి విచారణ అధికారిగా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహూల్ శ్రీరామ్ ను విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం కడప సెంట్రల్ జైలుకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం కడప సెంట్రల్ జైలులో రాహూల్ శ్రీరామ్ షేక్ దస్తగిరిని 3 గంటల పాటు విచారించారు. రాహూల్ శ్రీరామ్ ఎవరెవరు నీకు బెదిరించారు, ఏమి ఇబ్బందులకు గురి చేశారు, ఏ ఏ అధికారి నిన్ను ఇబ్బందులకు గురి చేశారో అనే కోణంలో దస్తగిరిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. అలాగే ఆ సమయంలో పని చేసిన సిబ్బందిని కూడ విచారించినట్లు తెలిసింది. షేక్ దస్తగిరి 2023 నవంబరు 28న ఎస్.ఎస్.ఆర్ బ్యారక్ లో జరిగిన సంఘటన కు సంబంధించి పూర్తి వివరాలను విచారణ అధికారికి వివరించినట్లు తెలిసింది. తనను అన్యాయంగా అధికారులు కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టిన వైనాన్ని ఆయన వివరించినట్లు తెలియ వచ్చింది. విచారణ అనంతరం దస్తగిరి సెంట్రల్ జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన నలుగురి పై నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని విచారణ అధికారి ఆదేశించడంతో విచారణకు వచ్చాను అని తనను ఇబ్బంది పెట్టి, అన్యాయంగా కేసులు నమోదుచేసిన అధికారుల గురించి విచారణ అధికారికి వివరించామన్నారు. వై.సి.పి ప్రభుత్వంలో చాలా మంది అధికారులు తనను ఇబ్బంది పెట్టారన్నారు. ఈ సంఘటన పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ క్షుణ్ణంగా పరిశీలించి తగిన న్యాయం చేయాలన్నారు. విచారణలో అధికారులకు ఏ సమాధానాలు చెప్పారని దస్తగిరిని విలేకరులు ప్రశ్నించగా విచారణకు సంబంధించి వివరాలను గోప్యంగా వుంచాలన్నారు. రేపు విచారణకు హాజరు కావాలని కోరలేదని, అవసరమైతే పిలుస్తారన్నారు. విచారణ అనంతరం అన్ని బయటకు వస్తాయన్నారు. ఈ కేసులో న్యాయం జరిగిందా అని విలేకరులు ప్రశ్నించగా, ఖచ్చితంగా జరగాలి, జరుగుతుందని కూడ దాని పై ఎటువంటి అనుమానం లేదన్నారు. ఈ కేసును కూటమి ప్రభుత్వానికి సవాల్ లాంటిదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలోనే వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి వివేకానందరెడ్డి హత్య చేయించి, తెదేపా పై నెపం నెట్టారన్నారు. నారాసుర రక్త చరిత్ర అంటూ చంద్రబాబు చేతిలో కత్తి పెట్టారన్నారు. వాస్తవాలు బయటకు వచ్చాయి. జగన్ తన హాయాంలో తప్పు చేయక పోతే ఆ కేసును ఎందుకు విచారణ చేపట్టలేదని, తన చిన్నాన్న కేసును విచారించాలని ఎందుకు కోర్టుకు వెళ్లలేదని దస్తగిరి ప్రశ్నించారు. వివేకా హత్య ఎవరు చేశారనేది ప్రజలు, మీడియా అందరికి తెలుసన్నారు. తొందరలో నిజా నిజాలు బయటకు వస్తాయన్నారు. న్యాయం నూరుశాతం జరుగు తుందన్నారు. కూటమి పెద్దలు ఈ కేసు పై దృష్టి పెట్టారన్నారు. విచారణ స్టార్ట్ అయ్యిందని, తొందరలో ఎండ్ కార్డ్ పడుతుందన్నారు. రేపు విచారణ కాగా ఈ కేసులో వున్న జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ ను శనివారం విచారించనున్నట్లు తెలిసింది. అలాగే డి.ఎస్పీ నాగరాజు, సి.ఐ ఈశ్వరయ్యలను పోలీసు అధికారులు విచారించనున్నట్లు తెలిసింది. విచారణ అధికారి శుక్ర, శనివారాల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిసింది. నివేదిక ఆధారంగా సంబంధించిన వారి పై చర్యలు తీసుకునే అవకాశం వుంది.

# తప్పులు లేకుండా రీసర్వే నిర్వహించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్**



**లక్కిరెడ్డిపల్లి; ఫిబ్రవరి 07, ప్రభాతవార్త**

రైతులందరూ రి సర్వేకి హాజరయ్యేట్లు తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, తప్పులు లేకుండా సర్వే సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దీన్నే పాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వేని క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆయన పరిశీలించి, రెవెన్యూ అధికారులతో రీ సర్వేస్ సక్రమంగా నిర్వహించి ప్రతి రైతుకు సరైన హద్దులు చూపించాలని అలాగే ఈ సర్వే కి వెళ్లేముందు ప్రతి రైతుకి మూడు రోజులు ముందుగానే నోటీసులు జారీ చేసి వారిని గాని వారి కుటుంబ సభ్యులు గానీ అందుబాటులో ఉండేలాగా చూసుకోవాలన్నారు అనంతరం దిన్నెపాడు గ్రామ సచివాలయంలో రీసర్వే టీమ్ సభ్యులతో జరుగుతున్న సర్వే గురించి మాట్లాడుతూ దీన్నేపాడు పరిధిలోని వాన్‌పిక్, అటవీ, దేవదాయ శాఖలకు సంబంధించిన భూముల విషయమంలో ఆయా శాఖల అధికారులకు సమాచారం అందజేసి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని అన్నారు అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు వీఆర్వోలు, సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తాసిల్దార్ హరిప్రసాద్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్ మండల సర్వే మదన్మోహన్ గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# దోచుకున్న వెండి వస్తువులు స్వాధీనం



**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి7 ప్రభాతవార్త**

నందలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్దిరోజుల క్రితం టంగుటూరు మంచాలమ్మ ఆలయంలో వెండి వస్తువులు చోరి కేసులోఇద్దరు నిందితులనుపోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితులు రాజంపేట రాంనగర్‌కు చెందిన తలారి బాలకృష్ణ 40, కర్నూల్ జిల్లా, కృష్ణగిరి మండలం, అల్లంకొండ గ్రామానికి చెందిన పూర్లగుంట రామాంజనేయులు నుంచి 1,442.33 గ్రాములు బరువు గల సుమారు లక్ష రూపాయలు విలువ చేసే మూడు వెండి కిరీటములు, రెండు వెండి పళ్లెములు, ఒక సెటగోపము , మూడు వెండి దీపాలను స్వాదీన పరుచుకున్నారు. నింది తులను రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే సమక్షంలో మీడియా ఎదుట హాజరపచ్చారు. కేసులోని ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ బివి రమణ, ఏఎస్ఐ, సుబ్బారాయుడు, పోలీసులు పాల్గొన్నారు.

# మదనపల్లిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్ వి భట్టి

**మదనపల్లి క్రైమ్ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్. వెంకటనారాయణ భట్టి శుక్రవారం మదనపల్లికి విచ్చేశారు. మదనపల్లి కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ సివిల్ కోర్టు భవనం శనివారం ప్రారంభోత్సవం ఉండడంతో న్యాయమూర్తి మదనపల్లికి విచ్చేశారు. ఇదే కార్యక్రమంలో పాల్గొనటానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరత్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు కృష్ణ మోహన్, మహేశ్వరరావు, టి సి డి శేఖర్ లు బీ కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్ కు విచ్చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు కోర్టు ప్రాంగణం ప్రారంభించిన అనంతరం వీరందరూ పలమనేరుకు వెళ్ళనున్నారు. మదనపల్లికి చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి కి జిల్లా న్యాయమూర్తి భీమారావు, మదనపల్లి సబ్ కలెక్టర్ మేగస్వరూప్, మదనపల్లి న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, రెవిన్యూ అధికారులు స్వాగతం పలికారు.

# ఉర్దూ మాధ్యమ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

**పీలేరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**



పీలేరులో ఉర్దూ మాధ్యమ జూనియర్ కళాశాల, ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణా కేంద్రం, గ్రంధాల యం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు యం.ఎ. షరీఫ్ ను పీలేరు మైనారిటీ యువనేత ఎన్టీఆర్ నఫీస్ కోరారు. శుక్రవారం ఆయన పీలేరు నియోజకవర్గం పరిధి లోని వాల్మీకిపురంలో మైనారిటీ వ్యవహారాల సలహాదారులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన పీలేరు మండలంలో ఉర్దూ అభ్యసించే విద్యార్థులు గణనీయ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో ఉర్దూ మీడియం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, మైనారిటీ విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత ఉర్దూ కళాశాల పీలేరులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 10వ తరగతి వరకు ఉర్దూ మీడియం చదివిన ఆడపిల్లలలో చాలామంది ఇంటర్ అందుబాటులో లేకపోవడంతో, బయట ప్రదేశాలకు వెళ్ళి చదవలేక తమ చదువును మధ్యలోనే మానేస్తున్నారని తెలియజేశారు. అదేవిధంగా పీలేరులో ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణా కేంద్రం, గ్రంధాలయం కూడా ఏర్పాటు చేసి పీలేరు ప్రాంత మైనారిటీ విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీవారి ఊరేగింపు

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ః**

మండలం కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం టిటిడి ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, కృష్ణరాజు, రమేష్, ధనుష్ స్వా ములు స్వామివారికి పుష్పాలంకరణ, పుష్ప ఫల అలంకరణతో ఉదయం శ్రీవారు కల్పవృక్ష వాహనంపై ఆలయ మాడవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని హనుమంత వాహనంపై అలంకరించి కోసువారిపల్లె పురవీధులతోపాటు మాడవీధుల్లో మంగళ వాయిద్యాలు, హరినామ సంకీర్తనలతో అత్యంత వైభవోపేతంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో టిటిడి ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరి కథా కాలక్షేపం, సంగీత విభావరి, గోవింద భజన కార్యక్రమాలు తోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల ఊరే గింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, అర్చ నలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి స్వామివారి తీర్థప్ర సాదాలు పొందారు.



# బ్రహ్మంగారిమఠంలో పట్టపగలు రెచ్చిపోయిన చైన్ స్నాకర్స్

**బ్రహ్మంగారి మఠం ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో పట్టపగలే చైన్ స్నాకర్స్ రెచ్చిపోయారు ఒంటరిగా కనిపించిన మహిళలే లక్ష్యంగా పెట్టుకుని బంగారు ఆభరణాలు అపహరించే పని చేస్తున్నారు శుక్రవారం నాడు బ్రహ్మంగారిమఠంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న మండ్ల నరసింహులు సతీమణి నాగమ్మ ఇంటి నుండి మఠం సెంటర్ కు రావడానికి ఆటో కోసం ఒంటరిగా ఎదురుచూస్తూ ఉండగా అటు నుండి వచ్చిన ఇద్దరు చైన్ స్నాచర్ల బైకు పైన వచ్చి ఆమె ఒంటరిగా ఉండడం గమనించి వెనుక మాటుగా ఆమె మెడలో నుండి బంగారు సరుడును లాక్కుని పరారయ్యారు దుండగులు చేసిన పనికి నాగమ్మ లబోదిబోమని భర్త నరసింహులుకు సమాచారము ఇవ్వగా వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై చంద్రశేఖర్ కు ఫిర్యాదు చేశారు ఫిర్యాదు అందుకున్న స్థానిక ఎస్సై హుటాహుటిన తన సిబ్బందితో కలిసి దుండగులు వెళ్లిన రోడ్డు మార్గాన పరిశీలించి ఎంతో చాకచక్యంతో మండలంలోని రేకలకుంట సమీపం వద్ద చైన్ స్నాకర్స్ అయినా ఇద్దరు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు వారి దగ్గర ఉన్న విలువైన ఆభరణాలను తీసుకొని ఇద్దరిని మైదుకూరులోని సిఐ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. దోపిడీ జరిగిన కొన్ని గంటల సమయం వ్యవధిలోనే చైన్ స్నాకర్స్‌ను పట్టుకున్న స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ను పలువురు అభినందించారు.

# కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటుచేయాలి

**దువ్వూరు, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**



కృష్ణానదికి సంబంధించి నీటిపారుదల మొత్తం రాయలసీమ జిల్లాల్లో ఉందని అందువల్ల కృష్ణానది యాజమాన్య బోర్డును హైదరాబాద్ నుంచి తరలించి కర్నూలులో ఏర్పాటుచేయాలని రైతు సేవాసమితి నియోజకవర్గం అధ్యక్షుడు ఏవి రమణ అన్నారు. శుక్రవారం డిప్యూటి తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కూటమి ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కింద 20వేల రూపాయలు ఇస్తామని వాగ్దాణం చేశారని దానిని నెరవేర్చాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అయినా రాజోలి, తెలుగుగంగ, హంద్రీనీవా ప్రాజెక్టుల పూర్తి కాలేదని వాటికి నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 12వ తేదిన కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నామని రైతులందరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, రాఘవేంద్రా, రామాంజరెడ్డి, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు

**గాలివీడు, ఫిబ్రవరి 7(ప్రభాతవార్త):**

మైనార్టీ, క్రిస్టియన్ తరగతుల వారు 2024-25 సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గాలివీడు మండలానికి ఏపీజీబీ-13, ఎస్బీఐ-13, యూనియన్ బ్యాంకు-13, ఏపీజీబీ నూలివీడు బ్రాంచ్-12 మొత్తం 51 యూనిట్లకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఒక్కో యూనిట్ విలువ లక్ష రూపాయల నుండి రూ.5 లక్షల వరకు ఉందన్నారు. అందులో 50 శాతం సబ్సిడీ పోను 50 శాతం బ్యాంకు లోను చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## 50మందికి కంటి పరిక్షలు

**దువ్వూరు, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రొద్దుటూరుకు చెందిన అభిలాష్ నేత్ర వైద్యశాల ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 50మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వీరిలో 10మందికి కంటి శుక్లములు ఉన్నాయని గుర్తించి వారికి అభిలాష్ నేత్ర వైద్యశాల నందు ఆపరేషన్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేష్ బాబు, చంద్రమౌళి పాల్గొన్నారు.

## డిజిటల్ లావాదేవీలపై అవగాహణ



**ఖాజీపేట, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**

డిజిటల్ లావాదేవీలు మరియు ఆర్థిక అక్షరాస్యత పట్ల విధ్యార్థులు అవగాహణ పెంపొందించుకోవాలని హైస్కూల్ హెడ్‌మాష్టర్ సి.గాయత్రీ భాయి పిలుపునిచ్చారు. హైస్కూల్ నందు రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డిపాజిటల్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధ్యార్థులు, మీరు మీ కుటుంబ సభ్యులు, రైతులు, పొదుపు సంఘాల మహిళలు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఫోన్లలో వ్యక్తిగత సమాచారాలు ఓటీపీలు షేర్ చేయరాదని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. హెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్, బ్యాంకు లావాదేవీల గురించి మా హెడ్స్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అర్బన్ ప్రాంతాల్లో, సెమి అర్బన్ ప్రాంతాల్లో ఈ అవగాహణ విరివిగా ఏర్పాటుచేస్తున్నాం. ఈ కార్యక్రమంలో కె.ఎస్.రూరల్ మీడియా కళాజాత బృందం కళా ప్రదర్శణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విధ్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నులి పురుగుల నిర్మూళనకు మాత్రలు వేయించాలి

**ఖాజీపేట, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**



నులి పురుగుల నిర్మూళనకు ప్రతి ఒక్కరూ జాతీయ నులి పురుగుల నిర్మూళన దినోత్సవ దినం ఫిబ్రవరి 10న తమ పిల్లలకి అల్బండజోల్ మాత్రలు వేయించాలని శుక్రవారం నాడు ఖాజీపేట మండల అభివృద్ధి అధికారి ఎం.వెంకటరమణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ ఆయేషా సుల్తాన ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు పిల్లల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆయేషా సుల్తానా మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూళన ఈనెల 10వ తేదిన 1సంవత్సరం నుండి 19సంవత్సరాల వరకు వయసు గల పిల్లలకు అల్బండజోలు 400ఎం.జి మాత్రలు వేయాలని, వయసు 1 నుండి 2సంవత్సరం లోపు 1/2టాబ్లెట్ 200ఎంజీ, 2 నుండి 19సంవత్సరాల వయపు వరకు 400ఎంజి వేయాలని తెలియజేశారు. నులి పురుగులు సోకిన పిల్లలు, కిశోర్ బాలల వివిధ ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం మరియు ఆందోళన, కడుపు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని అన్నారు. ఫిబ్రవరి 10వ తేదిన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూళన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తప్పకుండా పిల్లలకు అల్బండజోలు మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, డాక్టర్ ఆయేషా సుల్తానా, మండల విద్యాశాఖాధికారి నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఖాజీపేట వైద్యవిస్తరణ అధికారి బి.నాగభూషణం, వైద్య సిబ్బంది, ఆశ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ శోభన్ బాబు, కృష్ణప్రియ, ఏఎన్ఎం శాంతమ్మ, హేమలత, ఆశ నూర్జహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంపు

**గోపవరం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

ప్రభుత్వ అందిస్తున్న కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ అందజేయడానికి, లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 12 వ తేది వరకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహ వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడువు ఈనెల 8వ తేదీ నాటికి ముగియ్యడంతో 12 వ తేదీ వరకూ పెంచడం జరిగిందన్నారు. అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కొరకు దరఖాస్తు చేసుకుని రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలి

**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 7 ప్రభాత వార్త**

మండలంలోని ఆయా విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో చేస్తున్న మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కులాయప్ప పేర్కొన్నారు. ఉదయం 9.00 ల నుండి మధ్యాహ్నం 12.00 గ్న. ల వరకు గానుగ పెంట, శ్రీనివాసపురం, పి పి కుంట సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్తు సరపరలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్, షర్మిల రాణి లు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించి సేవలు మరింత మెరుగుపరుచుకునేందుకు ఈ మరమ్మత్తులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**రామసముద్రం, ఫిబ్రవరి7ప్రభాతవార్త**

ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి హేమలత, వైద్యఅధికారిని లీల, ఈఓఆర్డి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని సిఆర్పిలకు మరియు అంగన్వాడీ టీచర్లకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి హేమలత, వైద్య అధికారిని లీల, డాక్టర్ ప్రత్యూష,ఈఓఆర్డి సుధాకర్ రెడ్డి, సిఆర్పిలు, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

**సిద్దవటం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

కడప కోర్టు భవనం న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్ ఈనెల 9న బాండెడ్ లేబర్ నిర్మూలన దినం పురస్కరించుకొని వర్క్‌షాప్ మరియు న్యాయ విజ్ఞాన సదస్సు జిల్లా అధికారులకు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాండెడ్ లేబర్ నిర్మూలన దినం ప్రాముఖ్యతను తెలిపారు. 1976లో భారతదేశంలో బాండెడ్ లేబర్ సిస్టంను రద్దు చేయడానికి అబోలిషన్ యాక్ట్ 1976 రూపొందించబడిందన్నారు. ఆర్టికల్ 23, సెంట్రల్ సెక్టార్ స్కీం ఫర్ రిహాబిలిటేషన్ ఆఫ్ బాండ్ లేబర్ 2021 తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని వెట్టిచాకిరి నిర్మూలన, నిర్బంధ ఉచిత విద్య, బాండెడ్ లేబర్ సిస్టం చట్టం 1986 ప్రకారం అతిక్రమించిన వారికి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప రెవెన్యూ డివిజనల్ అధికారి పి.జాన్ ఎర్విన్, డిస్టిక్ ట్రైనింగ్ కాలేజీ సబ్ డివిజనల్ పోలీసు అధికారి కరీం, డిస్టిక్ ప్రొబేషన్ అధికారి చెన్నారెడ్డి, డిస్టర్బ్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ యాదవ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఇతర డిపార్ట్‌మెంట్ల అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

## శాస్త్రసీయ సలహా సంఘం సమావేశం

**కలికిరి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరిలో 2024-25లో చేసిన కార్యక్రమాల గురించి 2025-26 చేయబోయే కార్యక్రమాల ప్రాణాళిక ఏర్పాటు కోసం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధనా సంచాలకులు డా.వి.సుమతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా డా.షేక్ ఎన్.మీరా డైరెక్టర్ వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ జోన్ 10 గౌరవ అతిథిగా డా.జి.శివనారాయణ, వ్యవసాయ విస్తరణ సంచాలకులు, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా అధికారులు మరియు రైతులు, కృషి విజ్ఞాన కేంద్రంలోని ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించారు. తరువాత కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కె.మంజుల 2024-25లో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. డైరెక్టర్, ఆఫీసర్లు 2025-26లో చేపట్టే ప్రయోగాల గురించి శాస్త్రవేత్తలకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం, శాస్త్రవేత్తలు డా.మహేశ్వర్‌రెడ్డి, డా.దేవకీ, డా.వజంత, రాస్ కేవీకే, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, వేలూరు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.తిరుమురుగన్, అన్నమయ్య జిల్లా పశు వైద్యాధికారి డా.గుణశేఖర్, పీలేరు హార్టికల్చర్ ఆఫీసర్ సుకుమార్, అభ్యుదక, రైతులు రాజారామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సహదేవరెడ్డి, శశి, ఆనంద్, రమేష్, శ్రీమతి స్వాతిశ్రీ, అహ్మద్‌బాషా, కేవీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నియంత్రణ

**ముద్దనూరు, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:**

ప్రపంచ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహనా మీటింగ్ ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మెడికల్ ఆఫీసర్ శ్రీ కాంత్ అధ్యక్షతన శుక్రవారంనాడు ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డిప్యూటీ డియంహెచ్ఓ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వపాఠశాలలు, జిల్లా పరిషత్ హై స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్ నందు చదువుకొంటున్న విద్యార్థులకు ప్రతి ఒక్కరికి ఈ నులిపురుగులమాత్రలు మింగించాలని డిప్యూటీ డియం హెచ్ ఓ శివప్రసాద్ రెడ్డి అన్నారు. ప్రతి ఏ యన్ యం, యం యల్ హెచ్ పి, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని, 95శాతం పూర్తి చేయాలని అన్నారు. ఈ నెల 10వతేది ఏ ఒక్కరూ డ్యూటీకి ఆబ్సెంట్ కారాదని అన్నారు. ఈ మాత్ర మింగిన విద్యార్థులు నులిపురుగులనుండి రక్షణ పొందడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జున ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకులు శోభాకు మారి, రామారావు, సిబ్బంది యంయల్‌హెచ్‌పిలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు ఫిబ్రవరి 12 పెంపు

**లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 07 ప్రభాత వార్త**

బీ.సీ. కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు ను ఫిబ్రవరి 12 వరకు పెంచినట్లు ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు. అనంతరం ఎంపీడీవో రెడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులైన పేదలందరికీ అందజేయడమే లక్ష్యంగా లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని బిసి , కాపు సహ వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తు గడువును ఫిబ్రవరి 12 వరకు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కొరకు 12 లోపల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## బాలల ఆరోగ్యంతోనే

# దేశ సౌభాగ్యం ముడిపడి ఉంది



**పీలేరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**

బాలల ఆరోగ్యంతోనే దేశ సౌభాగ్యం ముడిపడి ఉందని పీలేరు ఎంపీడీఓ శివశంకర్, తలుపుల పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. పీలేరు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి (ఎన్.డి.డి) టాస్క్ పోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ప్రతికూల ప్రభావంతో రక్తహీనత, పోషణ లోపం, బలహీనత, కడుపునొప్పి, వీరేచనాలు మొదలగు అనారోగ్య లక్షణాలతో పిల్లలు ఏకాగ్రత, నేర్చుకో గల సామర్థం కోల్పోవడమే కాకుండా చదువులో రాణించలేరన్నారు. నులిపురుగుల సంక్రమణ వ్యాప్తిని నియంత్రించే ఆల్బెండజోల్ 400 మాత్రను ప్రతి విద్యార్థి సద్వినియోగానికి అందరం బాధ్యత వహిద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ కార్తీక్ కుమార్, ఎంఈఓలు వై. లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి, పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిహెచ్ఓ జయలక్ష్మి, పర్యవేక్షణాధి కారులు, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వెన్నెల జ్యోతి రమా బాయిా అంబేడ్కర్



**పీలేరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**

పట్టణంలోని స్థానిక లక్ష్మీ పురం నందు మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షలు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి త్యాగశీలి ఆదర్శమూర్తి మాత రమా బాయి అంబేడ్కర్ 127వ జయంతి సందర్భంగా స్థానిక మహిళలు రమాబాయా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేడ్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ రమా బాయి ఒక నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించి భారతదేశానికి రాజ్యాంగం రూపంలో అంబేడ్కర్ గారిని మనకందించారని మహనీయులు చేసిన త్యాగాలను మనం ఎల్లవేళలా స్మరిస్తూనే ఉంటూ జ్ఞానం అనే దీపాన్ని వెలిగించాలన్నారు. బాబాసాహెబ్ ను ఇబ్బంది పెట్టకుండా సహకరించిన గొప్ప త్యాగశీలి మాత రమాబాయి అంబేడ్కర్ ఆ కాలంలోనే కుటుంబ భారమునంత మోస్తూ తన సంతానాన్ని జీవితాన్ని సర్వాస్వాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి అని ఆమె త్యాగం సహనం మరువనిది ఆ మహా తల్లి జయంతి ఘనంగా నిర్వహించుకోని వారి సేవలను త్యాగాలను స్మరించుకుందామని తెలిపారు కార్యక్రమం మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్,సి.ఆర్.డి.ఎస్.అధ్యక్షులు కె. గటప్ప, మాలమహానాడు మండల యూత్ ప్రెసిడెంట్ జెట్టి దుర్గా ప్రసాద్,కుశల్ కుమార్, లక్ష్మీ, చెంగమ్మ, రత్నమ్మ, సరస్వతి, స్వాతి, యల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రామలింగారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

**పీలేరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**



మండలంలోని జాండ్ల గ్రామం పచ్చారు మాకుల పల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు శెట్టిపల్లి బాబ్జిరెడ్డి తండ్రి శెట్టిపల్లి రామలింగారెడ్డి గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టడంతో సమాచారం తెలుసుకుని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి రామలింగారెడ్డిని పరామర్శించారు. శెట్టిపల్లి రామలింగారెడ్డి గతంలో జాండ్ల గ్రామం సర్పంచ్ గా 24 సంవత్సరాలు గ్రామానికి సేవలు అందించారని ఆయన అన్నారు. అనంతరం బాబ్జిరెడ్డి, వారి కుటుంబ సభ్యుల్ని ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిర్మాణాలు పూర్తి చేసుకొనేందుకు వినతులు



**పీలేరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**

పట్టణంలోని ఎల్లమందక్రాస్‌లో షాది మహల్, ఖబరస్థాన్ ఆగిన నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు కల్పించాలని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికు మైనార్టీలు విన్న వించుకున్నారు. శుక్రవారం ఆయన యల్లమంద క్రాస్ లోని షాది మహల్, ఖబరస్థాన్ స్థలం పరిశీలించారు. 2013 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో షాది మహల్, ఖబరస్థాన్ నిర్మాణాలు చేపట్టామని రూ.20 లక్షలు డబ్బు కూడా సాంక్షన్ చేశారని దాంతో పిల్లర్ వరకు పనులు చేపట్టామని ప్రభుత్వం మారిన తర్వాత ఆగిపోయాయని మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికు తెలియజేయడంతో, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి షాదీ మహల్ ఖబరస్తాన్ ల ఆగిన నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి అనుమతులు కల్పించడంతోపాటు, ఖబర్ స్థాన్ కొరకు కాంపౌండ్ వాల్ పనులు మొదలు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు, ముస్లిం మైనార్టీలు హనీఫ్, హబీబ్, షరీఫ్, అమీర్, హుస్సేన్ షంషీర్ కరీం, బోదేషా,ముస్తఫా, అల్లాబఖష్, పలువురు నాయకులు కార్యకర్తలు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ



**వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**

నులి పురుగుల మందులను పిల్లలు తప్పని సరిగా తీసుకోవాలని, ఏడాది వయస్సు నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి ఒకరూ అలెజెండజోలు 400 మీగ్రా మాత్రలను తీసుకోవాలని ఎంపీడీవో మనోహర్రా రాజు అన్నారు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 7వ తేది నుంచి 10వతేదివరకు మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని 9560 మంది పిల్లలకు ఉచితంగా నులి పురుగుల నిర్మూలన మాత్రలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని ఆరోగ్యవిద్యాధికారి మహమ్మద్ రఫి తెలిపారు ఈ అవకాశాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అంతకు మునుపు నులిపురుగల నిర్మూలనపై ముద్రించిన గోడపత్రికలను వైద్యాధికారులతో కలిసి ఎంపీడీవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటలక్ష్మి, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం




**వాల్మీకిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

రాబోవు రోజుల్లో సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దామని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, విశ్రాంత ఎస్పై శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం వద్ద తిరుపతి అమిరికన్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు వంద మందికి కంట పరీక్షలు నిర్వహించారు రాబోవు రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో సమాజసేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మస్తాన్వలి, చింతల రెడ్డెప్ప, నారాయణ, సారధి, రమణ, శంకర్రెడ్డి, గోపాల్ క్రిష్ణమూర్తి, వెంకట్రమణ, నజీర్, నాగరాజు, బషీర్, రామూర్తి, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



**బ్రహ్మం గారి మఠం ఫిబ్రవరి 07 ప్రభాతవార్త :**

రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమమే మా కూటమి ప్రభుత్వం యొక్క ధ్యేయమని, వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుపరు స్తుందని అందులో భాగంగానే నేడు బ్రహ్మం సాగర్ రిజర్వాయర్‌లో 10 లక్షల చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందని వీటి ద్వారా స్థానికంగా ఉన్నటు వంటి మత్స్యకారులకు ఉపాధిని అందించేందుకు తోడ్పాటు ఇస్తుందని మత్స్యకారులు వీటిని సమృద్ధిగా పెంచుకొని వారి యొక్క ఆర్థిక ఉన్నతికి తోడ్పడే విధంగా ఈ పథకాలను ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.

## చిన్న వయస్సులో మృతి చెందడం బాధాకరం



**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

బద్వేల్ మండలం రాజుపాలెం గ్రామం కు చెందిన వై.యస్.ఆర్.సి.పి నాయకుడు నాగరాజు కుమారుడు కార్తీక్ గురువారం ఆకస్మికంగా మృతి చెందారు.ఈ వార్త తెలిసిన తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చడం జరిగింది. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సీనియర్ నాయకులు పోలి రెడ్డి, వైస్.యం.పి.పి నరసింహా రెడ్డి, సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, తదితర నాయకులు ఉన్నారు

## ఫ్రెండ్స్ సేవా సంఘం ద్వారా ఆర్థిక సహాయం

**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**



ఫ్రెండ్స్ సేవా సంఘం ద్వారా మిత్రులు జనవరి నెల 17వ తేదీ జరిగిన తీర్మానాలలో భాగంగా ఎవరైనా మిత్రులు మరణిస్తే వారి అంతక్రియల క్నోస పదివేల రూపాయలను ఇవ్వాలని జరిగిన తీర్మానం మేరకు ఈ మధ్య చెన్నంపల్లి గ్రామంలోని గుర్రాల పెంచలయ్య అను మిత్రుడు మరణించడం జరిగింది. మిత్రులందరూ ఫ్రెండ్స్ సేవా సంఘం ద్వారా ఆ కుటుంబానికి పదివేల రూపాయలు అందించామని, ఫ్రెండ్స్ సేవా సంఘం రాబోయే రోజులలో సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా విశేషంగా సేవలు అందించాలని భావిస్తుందనీ, సేవా సంఘం అధ్యక్షులు లాయం యోగయ్య, ప్రధాన కార్యదర్శి గంగసాని సాంబశివారెడ్డి, ఆర్థిక కార్యదర్శి సముద్రాల శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జెపి రవికుమార్, ఉప కోశాధికారి గంటా రాజశేఖర్, ఉపాధ్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్, లీగల్ అడ్వైజర్ దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, దున్నుతుల మునిరెడ్డి, ఊరిబిండి జయరాం రెడ్డి ఓలేటి శంకరయ్య, మధులపల్లి చంద్రశేఖర్, టంగుటూరు సుబ్బారావులు కలిసి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు.

## పొలతల భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**పెండ్లిమర్రి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 25 నుంచి 27 వరకు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు పొలతల క్షేత్రంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలతలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, పొలతల ఆలయ ఈవో కృష్ణానాయక్, ఎస్సై మధుసూదన్‌రెడ్డి, రాజారెడ్డి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుప్పెడంత గుండెకు కొండంత అండ

**సిద్దవటం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

గుప్పెడంత గుండెకు కొండంత అండగా ప్రభుత్వ ఆసుపత్రులు నిలుస్తున్నాయని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ టి.ప్రకాష్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం సీహెచ్‌సీలో శుక్రవారం సిద్దవటం సీహెచ్‌సీలో మాధవరం, పి.కొత్తపల్లె, అట్లూరు పీహెచ్‌సీలోని స్టాఫ్ నర్సులకు, ఏఎన్ఎం, ఆశావర్కర్లకు గుండెకు సంబంధించిన వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటు బాధితులు ఇక నుంచి ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీసి లక్షలాది రూపాయలు వెచ్చించి వైద్యం పొందాల్సిన అవసరం లేదన్నారు. గుండె బాధితుల ఆందోళనలు పరిష్కరించడానికి సిద్దవటం సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాలుగా సిద్ధమైందన్నారు. గుండెపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే ఎంతో మందిని కాపాడవచ్చని ఆశా వర్కర్లకు వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డా.మురళీమోహన్, డా.శివాణ, డా.జ్యోత్న, డా.శ్రీకావ్య, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఆటో కార్మికునికి యూనిఫాం తప్పనిసరి

**సిద్దవటం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

ప్రతి ఆటో కార్మికునికి యూనిఫాం తప్పనిసరిగా ఉండాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు ఆటో కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మండలంలో ఉన్న ఆటో వాహనదారులకు డ్రైవర్లకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఆటో కార్మికునికి వాహనం నడిపేటప్పుడు యూనిఫాం దరించి ఉండాలని పీఎస్ నెంబరు వాహనంపై సమకూర్చాలని ప్రయాణికులను పరిమితికి మించి తరలించకూడదని దాని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆటో వెళ్లేటప్పుడు పాటలు పెట్టడం, సెల్‌ఫోన్ మాట్లాడడం నేరమని ప్రతి ఒక్కరూ నిబంధన ప్రకారమే వాహనాలు వినియోగించుకోవాలని ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## వైభవంగా కామాక్షమ్మ విగ్రహ ప్రతిష్ట

**సిద్దవటం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

మండలంలోని కనుమలోపల్లి గ్రామ సమీపాన కామాక్షిదేవి ఆలయంలో శుక్రవారం కామాక్షి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాలతో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, కుంబాభిషేకం, పూర్ణాహుతి వంటి పూజలను నిర్వహించారు. సిద్దవటం ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత, పసుపులేటి శ్రీనివాసులు, ఆర్ఐ ప్రసాద్, అమ్మవారిని దర్శించుకొని అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించి ధ్వజస్తంభం వద్ద కాయ కర్పూరం సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి భవనాన్ని మంజూరు చేయండి

**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**



విద్యార్థులు, ప్రజల విజ్ఞానం కొరకు ఉపయోగపడే గ్రంథాలయానికి శాశ్వత భవనం లేకపోవడం బాధాకరమని ఆవాజ్ కమిటీ పేర్కొంది. శుక్రవారం పట్టణంలోని ఆవాజ్ కమిటీ కార్యాలయం నందు నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఆవాజ్ కమిటీ సహాయ కార్యదర్శి యస్దాని భాష ,ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా లు మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా గ్రంథాలయము బాడుగ ఇంళ్లలో నడపబడుచున్నదని, దీనిపై అధికారులు గానీ ప్రజాపతి నిధులు గాని, స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. బద్వేల్ పట్టణంలో ఆర్డీవో కార్యాలయానికి వెనక భాగం వైపు అనేక ప్రభుత్వ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని అందులో ఒక భవనము బద్వేల్ గ్రంథాలయానికి అధికారులు కేటాయించాలని కోరారు. అలాకాని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోబద్వేల్ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ఎ సత్తార్. ఆవాజ్ నాయకులు కేబి రసూల్ .అబ్దుల్లా.మునీర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐగా రవికుమార్

**రామసముద్రం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

ఎస్సైగా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష, డి.ఎస్.పి కొండయ్య నాయుడు, తాలూకా సిఐ సత్యనారాయణ లను కలిసి విధుల్లో చేరారు. గతంలో కూడా రవికుమార్ ఇదే రామసముద్రం మండలంలో ఎస్ఐగా పనిచేసి శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపు, పేకాట, కోడి పందాలు, కర్ణాటక మద్యం, అక్రమ ఇసుక రవాణా విషయంలో ఎంతో బాధ్యతగా పనిచేశారు. ఈ మేరకు రెండోసారి ఈయన పనితీరును గుర్తించిన పోలీస్ శాఖ నిజాయితీగా, బాధ్యతగా పనిచేయాలని తన సిబ్బందికి ఎస్సై రవికుమార్ సూచించారు.

## నులిపురుగుల నివారణకు చర్యలు

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**

ఫిబ్రవరి 10వ తేదీ "జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం"(డివార్మింగ్ డే)సందర్భంగా జిల్లాలో నాలుగు లక్షల 70 వేలకు పైగా పిల్లలకు నులిపురుగుల మందుల ఉచిత పంపిణీవైయస్సార్ జిల్లా, ఫిబ్రవరి 7:నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఈనెల ఫిబ్రవరి 10తేదీన జిల్లాలో ఉన్న 1నుంచి 19 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులు సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాలులో నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై (జిల్లా టాస్క్ ఫోర్స్ మీటింగ్) సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.... నులి పురుగులు ప్రమాదకరమని, వీటి తో రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చన్నారు. నులి పురుగుల నియంత్రణ కీలకమైన అంశమని, దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు.ఈ నెల ఫిబ్రవరి 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో నులిపు రుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

**CHANGE OF SPOUSE & CHILD NAME**

SPBG KHAJAPEERA S/O PBG BABASAHEB ARMY NO-15767918 L,EX HAVILDAR, D NO 7/3289, SRINIVASA NAGAR, PRODDATUR (VI,PO&M), KADAPA(Dt) A. P. 516360. MY ARMY SERVICE RECORD MENTIONED AS PBG GHOUSEIA BEGUM [wife], MEHFUZH [daughter] SHOWKHAR AKRAM[son] INSTEAD OF SHAIK GHOUSEIA BEGUM {WIFE} SHAIK MEHFUZH {DAUGHTER} SHAIK SHOWKHAR AKRAM {SON} VIDE AFFIDAVIT DATED 07/02-2025 BEFORE THE NOTARY PUBLIC (GOVT OF A P.

## నీటి సమస్యలపై చర్యలు తీసుకోండి



**చిన్నమండెం ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**
వర్షం లేని కారణంగా మండలంలో మంచి నీటి సమస్యలు ఏర్పడే పరిస్థితులు వున్నాయని ఆ సమస్య పరిష్కారానికి ముందస్తుచర్యలు తీసుకొని ప్రతి ఇంటికి నీళ్ల అందేవిదంగా చూడాలని, అలాగే గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపిపి సుధామాదురి పేర్కొన్నారు. శుక్రవారం మండల ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్నిశాకల అధికారులు వారి అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈఓపిఆర్డి శేఖర్‌నాయిక్ మాట్లాడుతూ మండలానికి ఒక జనరిక్ మెడికల్ షాపు బి సి(ఏ)కి మంజూరిందన్నారు. ఆర్‌డబ్యూయస్ అధికారి మాట్లాడుతూ మండలంలో దాదాపు అన్నిగ్రామాలలో నూతనంగా బోర్లు వేయడం జరిగిందని తద్వారా నీటి సమస్యలు లేవన్నారు. పిఆర్ జేఈ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో రూ 4.82 కోట్లతో 42 సిసి రోడ్డుపనులు చేసామన్నారు. ఇంకా కొన్నిగ్రామాలలో రోడ్లకు 31 పనులకు రూ 2 కోట్లు మంజూరయ్యాయన్నారు. యంఈఓ శివానాయక్ మాట్లాడుతూ కేశాపురం స్కూల్ లోకి గ్రామంలోని మురుగు నీరు వస్తుందన్నారు. దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పశువైద్యాధికారి గణేష్ మాట్లాడితూ పశుల భీమా కొరకు రైతులు రూ 400 కట్టి భీమా పొంధవచ్చన్నారు. పశువులు చనిపోతే 30 వేల రూపాయాలు పొందవచ్చన్నారు. అనంతరం అన్నిశాకల అదికారులు వారి వారి శాకల్లో జరుగుతున్న కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

## హెల్మెట్ దరిద్దాం ఇంటికి క్షేమంగా వెళదాం



**పులివెందుల, జనవరి 7, ప్రభాతవార్త :**
ప్రతి ఒక్క వాహనచోదకులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి ఇంటికి క్షేమంగా వెళ్దాము ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికడదాం అని పులివెందుల డీఎస్పీ మురళి అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో డియస్‌పి బుక్కే మురళి, పులివెందులటౌన్ సిఐ నరసింహులు, రూరల్ సి.ఐ, వెంకటరమణ, ట్రాఫిక్ సి.ఐ, హాజివలి, పులివెందుల ఎస్సై వెంకట ప్రసాద్, సబ్‌డివిజన్ యస్.ఐలు, పోలీస్ సిబ్బందితో శుక్రవారం అర్బన్ పోలీస్ స్టేషన్ నుండి పూలఅంగల్ల సర్కిల్ మీదుగా పాత ఆర్టీసి బస్టాండ్ సర్కిల్ వరకు హెల్మెట్ ఉపయోగించుటపై బైకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించక పోవడము వలన, కారు చోదకులు సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడము వలన రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నార న్నారని వివరించారు. అదేవిధముగా త్రిబుల్ రైడింగ్, మైనర్లు బైకులు నడుపుట, మద్యం సేవించి వాహనాలు నడుపుట వంటి చట్టవ్యతిరేక పనులకు పూర్తిగా దూరముగా ఉండాలని హెచ్చరించారు. అదేవిధముగా ప్రజలు కూడా రోడ్డు క్రాస్ చేయు సమయములో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని గుర్తు చేశారు.

## వెంటనే రాజీనామా చేయాలి

**వేంపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**



అమెరికాలో చట్ట విరుద్ధంగా ప్రవేశించిన, నివసిస్తున్న 104 మంది భారతీయులను తిరిగి భారత్‌కు పంపేందుకు అమెరికా అధికారులు వ్యవహరించిన తీరు గర్హనీయం, అమానుషం, అనాగరికం, ఆక్షేపణీయం అని ఏపీసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. చేతులకు సంకెళ్లు వేసి, కాళ్ళకు గొలుసులు కట్టి సైనిక రవాణా విమానంలో పశువుల కంటే హీనంగా 104 మందిని 24 గంటల సుదీర్ఘ ప్రయాణం చేయించి అమృతసర్ విమానాశ్రయంలో మొన్న 5 వ తేదీన వదిలి వెళ్లారని, ఇందులో 19 మంది మహిళలు, 13మంది చిన్నారులు వున్నారన్నారు. ఈ చర్య అమెరికా దురహంకారానికి మచ్చుతునక అన్నారు. మహోన్నత చరిత్ర కలిగిన భారత దేశానికి, భారత జాతికి ఇది అవమానకరం, అప్రతిష్ట, అగౌరవం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి మోడీ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాలని, విదేశాంగ మంత్రి జై శంకర్ కు, ప్రధాన మంత్రి మోడీకి ఒక్క క్షణం కూడా ఆ పదవులలో వుండే అర్హత లేదని, వారు వెంటనే రాజీనామా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి



**వేంపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**
నులిపురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపిడివో కుళాయమ్మ తెలిపారు. శుక్రవారం ఎంపిడివో కార్యాలయంలో టాస్క్ ఫోర్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నిర్మూలనకు సంబంధిత పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఎంపిడివో మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 17న మాఫ్ అప్ డే లో గైర్హాజరైన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పి.హెచ్.సీ వైద్యురాలు డాక్టర్ స్వాతిసాయి మాట్లాడుతూ 119 ఏళ్ల వయసు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు మండల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇచ్చేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి పి.హెచ్.సి. హెచ్ఇ షఫిఉన్నిషా, సిహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అంకయ్య పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**లక్కిరెడ్డిపల్లి; ఫిబ్రవరి 07, ప్రభాత వార్త**
గుండెపోటుకు గురైన సమయంలో సదురు వ్యక్తులకు అత్యవసర వైద్యం అందించడానికి లక్కిరెడ్డిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు వచ్చిన రోగులకు వైద్యులు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండెనొప్పి రోగులకు స్వాంతన చేకూరేలా హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.40 వేలు విలువ చేసే ఇంజెక్షన్ను రోగులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఎవరైనా గుండెనొప్పితో వస్తే ఈసీజీ తీసి రోగుల వివరాలు వారి సమస్యను పెద్దా సుపత్రి (హబ్)కు పంపించడం జరుగుతుందన్నారు. వాటిని వైద్య నిపుణులు పరిశీలించి, వారి సూచనల మేరకు రోగికి సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు సులోచన, రెడ్డి కీర్తి, నిషార్ అహమ్మద్, జీవన్ కుమార్, భరత్, రెడ్డికృష్ణ, ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐగా సత్యనారాయణ

**మదనపల్లి క్రైమ్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త.**



మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐగా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సిఐగా పనిచేస్తున్న రమేష్ నాయుడు ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. దీంతో అన్నమయ్య జిల్లా ఎస్‌బి సిఐగా ఉన్న సత్యనారాయణను మదనపల్లి రూరల్ సర్కిల్ బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం బాధ్యతలు తీసుకున్న సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఆ సాంగ్ ఈ కార్యక్రమాలు ఎక్కడైనా జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారం అందిస్తే పూర్తిగా నేరాలను కట్టడి చేస్తామన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## సద్వినియోగం చేసుకోండి

**ముద్దనూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**
నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు ముద్దనూరు మండల అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి నులి పురుగుల నివారణ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం చాలా పవిత్రమైన దని విద్యార్థులకు నులిపురుగుల వ్యాధినుండి ఈ ఆల్బండజోల్ మాత్ర రక్షణ కల్పిస్తుందని అన్నారు. మండలం లోని అన్ని పాఠశాలలు జిల్లా పరిషత్ పాఠ శాలలు, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఈ మాత్రలు మింగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది ముస్కిన్ బీ, చెన్నమ్మ ఓబులేష్, అటెండర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా...?



**రాయచోటి ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**
రాజ్యాంగం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా బీసీలపై దాడులు చేయడం అన్యాయమని మీరు మాట్లాడడం విచిత్రంగా ఉంది. గతంలో మీ ప్రభుత్వం హయాంలో బీసీలపై అక్రమ కేసులు పెట్టి మీరు వేధింపులకు గురి చేయలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఉసిరికాయల సిద్ధార్థ గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం అయన పట్టణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద మీడియాతో మాట్లాడుతూ 2020లో పట్టణంలో కళాశాల సమస్య పైన ప్రశ్నించినందుకు నాపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారని చెప్పారు. 2020 నుండి 2024 ఎన్నికల వరకు నాపై రాయచోటి సుండుపల్లె రాజంపేట నందలూరు ప్రాంతాలలో ఇటు శ్రీకాంత్‌రెడ్డి, అటు మేడా మల్లికార్జున్ రెడ్డిలు సుమారు పదికి పైగా అక్రమ కేసులు బనాయించి బీసీ బిడ్డను నేను చూడకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. అప్పుడు గుర్తుకురాని రాజ్యాంగం వైసీపీ నేతలపై వారి వ్యక్తిగత సమస్యల కారణంగా జరిగిన దాడులపై గడికోట శ్రీకాంత్‌రెడ్డి స్పందిస్తూ ఈ ప్రభుత్వంలో రాజ్యాంగ విలువలు ఉన్నాయా అని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## ప్రజా బలం ఉంటే 11 సీట్లకే...



**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**
వైసీపీ నాయకులకు ప్రజాబలం ఉంటే 11 సీట్లకే ఎందుకు పరిమితమయ్యారని టిడిపి నాయకులు, మాజీ కౌన్సిలర్ ఖలీల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఇస్లాంపురం వీధిలోని టిడిపి నాయకులు ముక్తియార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్ వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి కనపడలేదా అన్నారని, వారి పాలనలో జరిగింది అసాంఘిక కార్యక్రమాల నిర్వహణలో అభివృద్ధి అని, ఆయన కూడా అసాంఘిక కార్యక్రమాల నిర్వహకుడే అన్నారు. స్వంత వార్డులో గతంలో ముక్తియార్ మున్సిపల్ ఇంచార్జ్ ఛైర్మన్‌గా వున్న సమయంలో ఏర్పాటు చేసిన పార్కును అభివృద్ధి చేయలేదని, పార్క్‌కు వున్న వాచ్మెన్‌ను తొలగించి, కొత్త వాచ్మెన్‌ను ఏర్పాటు చేయలేని వ్యక్తి అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా వుందన్నారు. జనసేన జిల్ల ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు జిలానీ బాష మాట్లాడుతూ గతంలో మున్సిపల్ ఛైర్మన్ భీ మునిపల్లె లక్ష్మిదేవి మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని తెలిపితే, వైస్ ఛైర్మన్ ఖాజామోహిద్దీన్ మాత్రం ఆయనను సమర్థించడం వెనుక ఆంతర్యమేమిటో తెలియడం లేదన్నారు. చట్ట ప్రకారమే కోరమ్ వుండటం వలనే జనవరి 31 న కౌన్సిల్ సమావేశం నిర్వహించారని స్పష్టం చేశారు. ఆ సమావేశం విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్యానల్ చైర్మన్ కమిటీ పేర్లను పొందుపరచకపోవడంలో ఆంతర్యమేమి

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్ ఇర్ఫాన్ భాషా

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పాలకమండలి ఏర్పాటు అయిన అనంతరం జరిగిన మున్సిపల్ సమావేశంలో ప్యానల్ ఛైర్మన్ కమిటీ పేర్లను మినిట్స్ బుక్కులో పొందుపరచకపోవడంలో వైసీపీ నాయకుల ఆంతర్యం ఏమిటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎస్ ఇర్ఫాన్ భాష ప్రశ్నించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 31 నా జరిగిన కౌన్సిల్ సమావేశం పట్ల వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, చట్టబద్ధంగానే సమావేశం జరిగిందన్నారు. శుక్రవారం స్థానిక ఇస్లాంపురం వీధిలోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జనవరి 31వ తేదీన జరిగే కౌన్సిల్ సమావేశాన్ని ఛైర్మన్ సమావేశం వాయిదా వేసే విషయాన్ని వాట్సప్ ద్వారా మాత్రమే తెలిపారని, అది కూడా అజెండాలోని పలు అంశాలపై కౌన్సిలర్లు ఫైల్స్ చూడాలని తెలిపారని అందుకోసమే వాయిదా వేస్తున్నామని తెలిపారని, కానీ అజెండాలోని బొల్లవరంలోని ఫ్లాట్ల విషయం, రోడ్ల విస్తరణ, కార్పొరేషన్ వంటి పలు అంశాలపై ఓటింగ్ నిర్వహించాల్సి వస్తే 17 మంది టిడిపి, 1 జనసేన, 1 కాంగ్రెస్ కౌన్సిలర్, ఎమ్మెల్యే ఓటు కలిపి 20 మంది ఒకవైపు వుంటే 14 మంది మాత్రమే వైసీపీ కౌన్సిలర్లు హాజరు కావడంతో వారు నెగ్గలేమని ఉద్దేశంతో వాయిదా వేశారని వివరించారు. డిసెంబర్‌లో కూడా కౌన్సిల్ సమావేశం జరగకపోవడం, జనవరి లో కూడా జరగకపోతే ఇబ్బంది కరమనే ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు అందుబాటులో లేని కారణంగా ప్యానెల్ కమిటీ ద్వారా ప్యానెల్ ఛైర్మన్ ను ఎన్నుకొని కౌన్సిల్ సమావేశం నిర్వహించారని తెలిపారు. అజెండా లో ఏ అంశానైనా వారు సభ నిర్వహించి ఆమోదించకపోవడమో, వాయిదా వేస్తేనే సరిపోతుంది కదా అన్నారు. నెలకొకసారి జరిగే కౌన్సిల్ సమావేశంలో కూడా పాల్గొనలేని కౌన్సిలర్లు గౌరవ వేతనం ఏవిధంగా తీసుకుంటారని ప్రశ్నించారు.

## అవయవదానం అవగాహన

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**



కొవ్వూరు గ్రాండ్ ఆధ్వర్యంలో అవయవ దాన అవగాహన కల్పించాలని లక్ష్యంగా నిర్వహిస్తున్న 5కె, 3కె, 1.5కె రన్ పోటీల సభా వేదికను జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గరకు మార్పు చేశామని కొవ్వూరు గ్రాండ్ అధినేత ఓ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాము చేపట్టిన పరుగు పోటీలకు విశేష ఆదరణ లభించిందని ఇప్పటికే 3000 మంది పాల్గొనడానికి ముందుకు వచ్చారని ఇంకా 1200 మంది మిగిలి ఉన్నారని తెలిపారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే ఈ పరుగుల పోటీలలో క్రీడాకారుల భద్రత దృశ్య పోలీసు శాఖ సూచనల మేరకు వేదికను మార్చామన్నారు. అదే వేదిక దగ్గరే అల్పాహారం మరియు బహుమతి ప్రధానం అక్కడే నిర్వహించబడతాయని తెలిపారు. కావున క్రీడాకారులు క్రీడాభిమానులు వ్యాయామ ఉపాధ్యాయులు ఈవెంట్ నిర్వహణలో సహకరిస్తున్న వాలంటీర్లు అందరూ ఉదయం 6:30 గంటలకే జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గరకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మనిషా విద్యానికేతన్‌లో వార్షికోత్సవ వేడుకలు

**లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 07 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని మనీషా విద్యానికేతన్ హైస్కూల్‌లో ఘనంగా 30వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు డాన్స్ ప్రోగ్రాములుతో పాటు అనేక వినోద కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ కరెస్పాండెంట్ కృష్ణ చైతన్యరెడ్డి, డైరెక్టర్ షైనీ మాట్లాడుతూ స్కూల్ 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఈ స్కూల్లో చదివిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు ఉత్తమ లక్షాలను ఏర్పరచుకొని కలలు సహకారం చేసుకోవాలని తెలిపారు. మార్చిలో జరిగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులకు మరియు పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత స్థానాలకు చేరాలని విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ కృష్ణ చైతన్య రెడ్డి, డైరెక్టర్ షైనీ, ఉపాధ్యాయులు జగదేశ్వరీ, రెడ్డి రాణి, అయేషా భాను, రామానుజులమ్మ, సుజానే అష్రఫ్, సుగుణ, సుమియ, రెడ్డి సాయి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మదనపల్లె తహశీల్దార్‌గా ధనంజనేయులు

**మదనపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**



మదనపల్లె తహశీల్దార్‌గా ధనంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఖాజాబీ నిమ్మనపల్లెకు బదిలీ కావడంతో నిమ్మనపల్లెలో ఉన్న తహశీల్దార్ మదనపల్లెకు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భూ పరిష్కారాలకు సంబంధించి ప్రజలు విన్నవించే సమస్యల పరిష్కారానికికూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## మైనార్టీల సహలదారున్ని కలిసిన ఎస్.ఎ.మస్తాన్

**మదనపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**
మైనార్టీల వ్యవహారాల శాఖ సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్‌ను తెలుగుదేశం పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎ.మస్తాన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాయలసీమ జిల్లాల పర్యటనకు విచ్చేసిన ఆయనను హార్సిలీ హిల్స్‌లో కలసి శాలువ కప్పి పుష్పగుచ్చం అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మైనార్టీల సమస్యల గురించి మస్తాన్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మైనార్టీల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని ఆయనకు సూచించినట్లు తెలిపారు. ఆయనతో పాటు ముస్లిం మైనార్టీ నాయకులు, బి.కొత్తకోట మాజీ జడ్పిటిసి పర్వీన్‌తాజ్‌లు పాల్గొన్నారు.



## మైనార్టీల అభివృద్ధిపై మంత్రి ఫరూక్ ప్రత్యేక శ్రద్ధ

**(అన్నమయ్య ప్రతినిధి – ప్రభాతవార్త)**



మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రిగా ఫరూక్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని, అందువల్లే మంత్రిగా పనితీరుపై ఫస్ట్ ర్యాంక్ సాధించారంటూ రాజంపేట ముస్లీం మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు జి.గుల్జార్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. ముస్లీంల అభివృద్ధి కి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నార న్నారు. రాష్ట్రంలోని అన్ని మసీదుల నిర్వహణకు ప్రతినెలా రూ. 5000 చొ ప్పున సాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఫరూక్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. అలాతే హజ్‌కు వెళ్లే వారికి లక్ష రూపాయాల ఆర్థిక సహాయం మంజూరుకు విధి విధానాలను ఖరారు చేయాలన్నారు. మైనార్టీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించా ప్రత్యేక నిధులు రాబట్టేందుకు కేంద్రం తో సమన్వయం చేసుకునే దిశగా మంత్రి ఫరూక్ ఉండడం పట్ల కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఐఐటి నీట్ పోటీ పరీక్షకు శిక్షణ పూర్తయ్యి న పిఎంజేవికే భవనాలకు సిబ్బంది కేటాయింపు, నైపుణ్యాల అభివృద్ధి శిక్షణకు నంద్యాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కూడా గుల్జార్‌బాషా కోరారు.

## వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉచిత నైపుణ్య శిక్షణ

**ఎడ్యుకేషన్ : ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**
సింజెంటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు గ్రామీణ యువతీ యువకులకు వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మరియు సింజెంటా ఫౌండేషన్ ఇండియా ప్రతినిధులు ఎన్.సుబ్బరామిరెడ్డి, సందీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ శిక్షణ సమయంలో నూతన వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ వ్యాపారాలు, వ్యవసాయ లోన్లు, వ్యక్తిత్వ వికాసము, వ్యవసాయ సాంకేతికత, ప్రకృతి ఆధారిత వ్యవసాయం మరియు టెక్నాలజీ మీద నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కలదు. ఈ శిక్షణకు అర్హులు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలి. టెన్త్ క్లాస్ పాస్ అయి ఉండాలి వ్యవసాయం మీద ఆసక్తి కలిగిన యువత శిక్షణకు అర్హులని వారు ఒక ప్రకటనలో తెలిపారు మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న మా శిక్షణ సంస్థలో సంప్రదించగలరు మరిన్ని వివరాలకు 9063082227,9666582622 సంప్రదించాలని వారు కోరారు.

## ప్రమాదంలో తీవ్ర గాయలు

**చిన్నమండెం ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**
మండలంలోని దేవగుడిపల్లి గ్రామం కొండములకు చెందిన పసల రామాంజులు, సుజాతల కుమారుడు పసల సన్నీ అనేయువకుడు గురువారం రాత్రి రాయచోటి మదనపల్లి ప్రదాన రహదారిలో దేవగుడిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంలో చిన్నమండెం నుండి రాయచోటి వైపు వెళుతూ ప్రామాదవశాత్తు జారి రోడ్డుపై పడ్డాడు. ఈ సంఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని అంబులెన్స్‌లో రాయచోటీ ప్రభుత్వ ఆసుపత్రి అక్కడినుండి తిరుపతిలోని నారాయణాద్రి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ అతనిపరిస్థితి విషమంగా వుండడంతో వేలూరు సియంసికి తీసుకెళ్లగా అక్కడ వైద్యాధికారులు పరీక్షించి మైండ్‌డెడ్ ఐనట్లు తెలిపారని, అతని కుటుంబ సభ్యులు తెలిపారు. మరింత సమాచారం తెలియవలసి ఉన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలిసులు తెలిపారు.

## మన్నూరు హైస్కూల్‌కు డెస్కులు వితరణ



**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి7 ప్రభాతవార్త**
మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఐడిబిఐ బ్యాంక్ డెస్కను అందజేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాలకి 1,25,000 రూపాయలు విలువ కలిగిన స్టూడెంట్లకు 22 డేస్క్ లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 సుబ్బరాయుడు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం ఎంతో మంచి కార్యక్రమమని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండూరు పరిమళా మాట్లాడుతూ ఐడిబిఐ సామాజిక బాధ్యతగా తమ పాఠశాలను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంక్ చేసిన ఈ కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందని తెలియజేశారు. కడప ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ వాసు మాట్లాడుతూ సిఎస్ఆర్ స్ఫూర్తితో భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరిన తర్వాత సమాజానికి సహాయం చేయాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది వినోద్, సుబ్రహ్మణ్యం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

**మొలకలచెరువు ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**
మండలంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని వైకాపా ప్రజాప్రతినిధులు, ఎంపీపీ సాయిలీల, సర్పంచ్ రాంబాబు కోరారు. శుక్రవారం ములకలచెరువు మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. గత రెండు మండల సర్వసభ సమావేశాలు నిర్వహించకుండా కూటమి నాయకులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో ఇటీవల జడ్పీ సీఈఓ ఎంపీడీవో కార్యాలయంలో తంబలపల్లి టిడిపి ఇన్చార్జ్ జయచంద్ర రెడ్డి తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐదు మంది కూటమి నాయకులను మండల సర్వసభ్య సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానిస్తామని జడ్పీ సీఈవో తెలపడంతో మండల సమావేశం శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో హరి నారాయణ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి 15 ఫైనాన్స్ తో పాటు, జడ్పీ నిధులతో ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో భూగర్భ జలాల అడుగంటుతుండడంతో తాగునీటి సమస్యపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి ముందస్తు చర్యలు చేపడతామన్నారు. అనంతరం సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులపై తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. వారికి కావాల్సిన పేర్లతో బిల్లులు పెట్టుకొని పనులు చేపడుతున్నారు అన్నారు. అంతేకాకుండా చౌడ సముద్రం గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని అధికారులు వెంటనే



స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. మండలంలో 60 మంది పిల్లలు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చేందుకు ఐదు పాఠశాలలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఎంఈఓ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయత సంఘటనలు జరగకుండా మూలకలచెరువు సీఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేశారు. మదనపల్లి డిఎస్పి కొండయ్యనాయుడు ఎంపీడీవో కార్యాలయం పరిసరాలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపిపి సాయి లీలా, జడ్పిటిసి మోహన్ రెడ్డి టిడిపి నాయకులు నరసింహారెడ్డి, ప్రసాద్రెడ్డి, కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, bjp నాయకులు జయరామిరెడ్డి, సర్పంచ్లు రహమత్ బీ, రాంబాబు, క్రిష్ణమూర్తి, చిన్న మేకల వెంకటరమణారెడ్డి, మంజుల, ప్రభావతమ్మ, రెడ్డెప్ప, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి దృష్టికి కురబల సమస్యలు

**మదనపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**



రాష్ట్రంలో కురబలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రమంత్రి ఎస్‌పి సింగ్‌భాగేల్ దృష్టికి తీసుకెళ్ళినట్లు రాష్ట్ర కురబలసంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఢిల్లీ లో కేంద్రమంత్రిని కలసి కనకదాస్ జయంతి ఉత్సవాల జ్ఞాపికను అందజేసి సత్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కురబకుల ప్రజలు, విద్య, వ్యాపారాల్లో రాణివ్వాలని తెలిపారన్నారు. కురబ ప్రజానాయకులు పార్టీలకు అతీతంగా కుల అభివృద్ధికి ఐక్యమత్యంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో పర్యటించి కురబసమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించనున్నట్లు మంత్రి ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## 12వరకు ధరఖాస్తులు చేసుకోండి

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**



మండలానికి ఈనెల 12వ తేది వరకు బిసి రుణాలకు ధరఖాస్తులు చేసుకోవచ్చునని ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం గతంలో ఈనెల 7వరకు ధరఖాస్తులు చేసుకోవాలని తెలపగా లబ్దిదారుల సౌకర్యార్థం 12వరకు పొడిగించిందన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## వైఎస్ఆర్ పార్టీ మండల అధ్యక్షునిగా శ్రీనివాసులురెడ్డి

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :**



నిమ్మనపల్లె మండలం వైఎస్ఆర్ పార్టీ మండల అధ్యక్షునిగా కొమ్మెపల్లె శ్రీనివాసులురెడ్డి ఎంపికకావడంతో వైఎస్ఆర్ పార్టీ యువసేన తరపున రెడ్డిభాస్కర్ ఘనంగా హర్షం తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచారు. పార్టీ అధిష్టానం తమ సేవలను గుర్తించి ఈ పదవికి సహకరించిన ఎంపి మిథున్‌రెడ్డి, నియోజకవర్గ వైఎస్ఆర్‌పార్టీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్‌లకు ధన్యవాదాలు తెలిపారు. మండల వాసులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని నూతనంగా ఎంపికైన శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## నేడు రాజంపేటలో విద్యుత్ అంతరాయం

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి7 ప్రభాతవార్త**
మండలంలో 33/11 కెవి లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం, సబ్ స్టేషన్లో మరమత్తులు చేయ నన్ను అందువల్ల శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డి ఈ ఈ ఎం.సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట టౌన్, బోయన పల్లి, 33/11 కేవీ ఆకేపాడు, కట్టకిందపల్లి, హెచ్ చెర్లోపల్లి, తాళ్ళపాక సబ్ స్టేషన్ వీటి పరిది లో ఉన్న పరిసర గ్రామీణ ప్రాంతాలలో ఖవిద్యుత్ సరఫరాఖి ఉదయం 09.00 నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు. వినియోగ దారులు విద్యుత్ సంస్థకు సహకరించ వలసినదిగా ఆయన కోరారు.

